క్లుప్తంగా

ప్రభుత్వ చౌక దుకాణ గోడౌన్ పరిశీలన



గోడౌన్‌ను పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్

ఎర్రగుంట్ల : పట్టణంలో చౌక దుకాణాలకు సరఫరా చేసే ప్రభుత్వ గోడౌన్‌ను మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి బియ్యపు సంచులను, తూకాలను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరకులు పంపిణీ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో కొనసాగుతున్న నిరసనలు

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన కార్యక్రమం మంగళవారం నాటికి నాల్గవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆర్టీపీపీలోని పరిపాలన విభాగం కార్యాలయం వద్ద భారీగా నిరసన కార్యక్రమం చేపట్టారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారంపై ఏపీజెన్‌కో యాజమాన్యం స్పందించాలేదన్నారు.

నేడు డ్రాయింగ్ పోటీలు

వల్లూరు : ఆడుదాం ఆంధ్ర 2023–24 కార్యక్రమంలో భాగంగా బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మండలంలోని 9, 10, 11, 12 తరగతులు విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు మండల విద్యా శాఖాధికారి లిల్లెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర లోగో మరియు మస్కట్ అనే అంశంలో డ్రాయింగ్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

ముద్దనూరు : ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని వీటి సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి రైతులను ప్రోత్సహించాలని ముద్దనూరు డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని కొలవలి గ్రామంలో ఆయన ×ఆత్మ×ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతులు, వ్యవసాయ సిబ్బందికి చిరుధాన్యాల సాగుపై అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఆర్బీకే పరిధిలో కనీసం 50 ఎకరాలు చిరుధాన్యాలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం రవికుమార్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పొల్యూషన్ కంట్రోల్ యంత్రం ఏర్పాటు



న్యూకాలనీలో ఏర్పాటు చేసిన పొల్యూషన్ యంత్రం

ఎర్రగుంట్ల : స్థానిక 17 వార్డులోని న్యూకాలనీలో పొల్యూషన్ ఎంత మోతాదులో ఉందని తెలుసుకోవడానికి తిరుపతి పొల్యూషన్ కంట్రోలింగ్ శాఖ అధికారులు కాలనీలో పొల్యూషన్ యంత్రంను మంగళవారం ఏర్పాటు చేశారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఎరికలరెడ్డి తెలిపారు. 17వ వార్డులోని ప్రజలు పొల్యూషన్ వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని గతంలో అధికారులకు విన్నవించామన్నారు. వినతి మేరకు పొల్యూషన్ కంట్రోలింగ్ శాఖ అధికారులు యంత్రంను ఏర్పాటు చేశారన్నారు.

ఘనంగా స్వర్ణ పుష్పార్చన

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని కన్యతీర్థంలో శ్రావణ శుద్ధి పూర్ణిమ సందర్భంగా అమ్మవారికి ఘనంగా స్వర్ణ పుష్పార్చనను(108) స్వర్ణ పుష్పాలతో భక్తులు నిర్వహించారు. మంగళవారం కన్యతీర్థంలోని శ్రీ త్రిపుర సుందరీదేవి సమేత సుందరేశ్వరస్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అరకేజీ వెండి నాణెలు, అరకేజీ బంగారు పుష్పాలు అమ్మవారికి హారంగా వేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులకు వాటిని అందజేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

తల్లి పాల వారోత్సవాలు

వేంపల్లె : పట్టణంలోని క్రిష్టియన్ లైన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీఓ సునీత ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు శిశువుకు వ్యాధి నిరోధక శక్తిని అందిస్తూ ఒక టీకాలాగా పనిచేస్తుందన్నారు. ప్రతి తల్లి బిడ్డకు ప్రసవించిన గంట లోపే ముర్రు పాలును పట్టాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ప్రథంకో ఆర్డినేటర్ స్వరూప, అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు : స్థానిక బెస్త కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం తల్లిపాల విశిష్టత గురించి ఐసీడీఎస్ సూపర్వైజర్ గురమ్మ తెలిపారు. ప్రతి తల్లి సాధారణ ఉప్పు శాతం వాడకాన్ని తగ్గించి అయోడైజ్డ్ సాల్ట్‌ను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి వాసవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



మహదేవపల్లెలో గ్రామ సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్థితులలో పంటలు దెబ్బతిని దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చక్రాయపేట మండలం మహదేవపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మహదేవపల్లె, గంగారపువాండ్లపల్లె గ్రామ ప్రజలు వారి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులకు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019–20 సంవత్సరంలో మామిడి తోటల్లో పిందె, పూత రాలిపోయి 1500 మంది రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతులు వేసిన పంటలకు ప్రభుత్వం ఉచితంగా బీమాను చెల్లిస్తోందన్నారు. పంటలు సాగు చేసుకునేందుకు ఖర్చులకుగానూ రైతు భరోసా కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదికి రూ.13,500లు రైతు ఖాతాలో జమచేస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. మహదేవపల్లెలో రూ.1.15 కోట్లతో ఎన్‌ఆర్‌ఈజీఎస్, పాడా నిధులతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గండి క్షేత్రంలో గోశాలకు ముఖ ద్వారం, కాంపౌండ్ వాల్, షెడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి, చైర్మన్ పి.రాఘవేంద్రప్రసాద్‌లు ఎంపీని కోరారు. ముందుగా గోశాలకు ప్రభుత్వం మంజూరు చేసి చదును చేసిన 4 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, టూరిజం శాఖ డైరెక్టర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ నరేంద్ర, ఏడీఈ శ్రీకాంత్, సర్పంచ్‌లు శివారెడ్డి, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంతో
ప్రతి సమస్య పరిష్కారం



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నచెప్పలి సచివాలయ పరిధిలోని చిన్నరెడ్డిపల్లె, బయనపల్లె గ్రామాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులను సంబంధిత అధికారులతో అప్పటికప్పుడే పరిష్కరించారు. 30 ఏళ్లుగా పరిష్కారంకాని చిన్నరెడ్డిపల్లె వద్ద ఉన్న గాడిదల వంక సమస్య పరిష్కారమైంది. గత గడప గడపకు కార్యక్రమంలో గ్రామానికి చెందిన అబ్దుల్ సత్తార్ గాడిదల వంక పూడిపోయిందని, పూడిక తొలగిస్తే ఈ గాడిదల వంక నీరంతా చదిపిరాళ్ల, కమలాపురం చెరువులకు వెళ్లే కట్టుకొమ్మ కాలువలో కలుస్తుందని అలాగే అలిదెన ఓబాయపల్లె నుంచి ఈ కాలువ వస్తుందని, వర్షాలు, వరదల నీరంతా ఈ కాలువలో పారుతుందని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణం ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ పీఆర్‌లకు ఈ వంకలో పూడికను తొలగించి కట్టుకొమ్మ కాలువకు కలపాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోనే కాదు ప్రపంచంలోనే గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష.. కార్యక్రమాలు ఏ పార్టీ నిర్వహించలేదన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టాలు ఉండకూడదన్నదే సీఎం ఆశయం అన్నారు. 30 ఏళ్ల వంక సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం చిన్నచెప్పలి గ్రామంలో రూ.30 లక్షల డీఎంఎఫ్ నిధులతో నూతనంగా నిర్మించిన మంచి నీటి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, బుజ్జన్న, పుల్లారెడ్డి, నాగేంద్రరెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఎన్సీ పుల్లారెడ్డి, కొండారెడ్డి, గంగాధర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గఫార్, గండి భాస్కర్, నిఖిల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, అయ్యవార్ యాదవ్, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి

వల్లూరు : పాఠశాలల్లో విద్యార్థుల రక్షణపై ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం వుందని జిల్లా విద్యా శాఖాధికారి వై.రాఘవరెడ్డి తెలిపారు. మండల విద్యా శాఖాధికారి కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల పాఠశాలల భద్రత కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల కమిటీ మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులకు విద్యార్థుల రక్షణ గురించి అవగాహన కల్పించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టేలా చూడాలని అన్నారు. ఎంపీడీవో జుబేద మాట్లాడుతూ మండల కమిటీ ఆధ్వర్యంలో అందరం సమన్వయంతో పనిచేసి విద్యార్థుల రక్షణకు కృషి చేద్దామన్నారు. విద్యార్థులను అనవసర విషయాల్లో బయటికి పంపరాదన్నారు. నీటి కుంటలు, విద్యుత్ ప్రమాదాలను గురించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం డిఈవోను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సేఫ్టీ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఎంఈవో లిల్లెమ్మ, ఎంఈవో 2 విజయ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావచ్చు

లింగాల : రక్తదానంతో ప్రాణాదాతలు కావచ్చునని వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి తెలిపారు. మంగళవారం ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఎం.కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన హైకోర్టు న్యాయవాది జీవీఎస్‌ఎస్‌ఎస్ మూర్తి, తదితరులతో కలసి ప్రారంభించి మాట్లాడారు. జెఎన్‌టీయూ, లయోలా, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలల విద్యార్థులతోపాటు యూసీఐఎల్ సిబ్బంది, స్వచ్ఛంద రక్తదాతలు కలిపి 95 మంది రక్తదానం చేశారు. హైకోర్టు న్యాయవాది జీవీఎస్ ఎస్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ సువిశాలమైన ప్రశాంత వాతావరణంలో వృద్ధాశ్రమాన్ని నిర్మించి వారికి ఆశ్రమాన్ని కల్పిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ చేయూతనందించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, రక్తనిధి మెడికలాఫీసర్ డాక్టర్ శుభశ్రీ,, రిటైర్డు డీఎస్పీ ఖలీల్ సౌదాగర్, గండి క్షేత్ర అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొండారెడ్డి, నంద్యాల ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, టెలి కమ్యూనికేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గౌరి శంకర్, గండి క్షేత్ర కమిటీ మెంబర్ అంకాల్‌రెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించే నిర్మాణాలను కూల్చివేస్తాం



సుభాకర్‌రెడ్డి కాలనీలో సమస్యను పరిష్కరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు, కాలువలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేస్తామని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని సుభాకర్‌రెడ్డి కాలనీలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా ఇంటి నిర్మాణాలు చేపట్టేవారు వారి ఇష్టానుసారంగా ఇంటి ముందు కాలువలు ఆక్రమించి కట్టడం, రోడ్డుపై మెటికలు ఏర్పాటు చేయడం, రోడ్డుపైకి ర్యాంపులు వేయడం చేయరాదన్నారు. ప్రతి ఇంటికి చెందిన ప్లాన్ అప్రూవల్ అయిన తర్వాతనే ఇంటి నిర్మాణాలు చేపడితే సమస్యలు రావన్నారు. సుభాకర్‌రెడ్డి కాలనీలో దొడ్డి రస్తా సమస్యను అధికారులతో కలిసి పరిష్కరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

పెండ్లిమర్రి : పంటలు సాగు చేసే రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణమరాజు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య వీఓఏలకు ప్రకృతి వ్యవసాయంపై ఆయన శిక్షణ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల సమాఖ్యలో ఉన్న మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో అడిషినల్ ప్రాజెక్టు మేనేజర్ వసంత కుమారి, ఏపీఎం వెంకటేశ్వరరావు, మాస్టర్ ట్రైనర్ గంగిరెడ్డి, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సీఎం, ఎంపీ చిత్ర పటాలకు పాలాభిషేకం



వైఎస్ జగన్, వైఎస్ అవినాష్‌రెడ్డిల చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న వైఎస్ మధురెడ్డి, తదితరులు

సింహాద్రిపురం : నేతన్న నేస్తం నిధులు నేరుగా నేతన్న ఖాతాలలో జమచేసిన సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్పలు హాజరై మాట్లాడారు. 2017లో ధర్మవరంలో నేతన్నల దీక్షలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నేతన్న కుటుంబానికి నెలకు రూ.2వేల చొప్పున సహాయం చేస్తానని చెప్పడం జరిగిందని.. అన్న మాట ప్రకారం ఈ ఐదేళ్లల్లో ప్రతి నేతన్న కుటుంబానికి రూ.1.20 లక్షలు నేరుగా నేతన్నల ఖాతాలలో జమ కావడం జరిగిందన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చిత్ర పటాలకు నేతన్నల సమక్షంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జాఫర్, సర్పంచ్ రామ్మోహన్, మండల కో. ఆప్షన్ మెంబర్ నజీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజగోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, చేనేత సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, సురేష్, మహమ్మద్, షబ్బీర్, శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఎంఏ బషీర్, ఖాదర్‌వలీ, నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఆసుపత్రి భవనం ప్రారంభం

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుంటపల్లెలో నాడు–నేడు పథకం కింద రూ.1.86 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన ఆరోగ్య కేంద్ర భవనాన్ని బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అలాగే నూతన ఆర్‌బీకే భవనం, నూతన ప్రాథమికోన్నత పాఠశాల భవనాలను ప్రారంభిస్తారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముంపు వాసులకు త్వరలోనే నష్టపరిహారం

సింహాద్రిపురం : మండలంలోని పైడిపాలెం రిజర్వాయర్ ముంపు వాసులకు త్వరలోనే నష్టపరిహారం అందుతుందని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పైడిపాలెం గ్రామంలో ఇంకా కొంత మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సాంకేతిక లోపాలతో అందని కొందరి లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా డబ్బులు అర్హులైనవారికి అందుతాయని.. అలాగే ప్రాజెక్టు కింద జోకులెత్తుతున్న భూముల రైతుల పొలాలను అధికారులు పరిశీలించి నివేదికలు అందిస్తారన్నారు. నివేదికలు అందిన వెంటనే నష్టపరిహారం అందేటట్లు చూస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నిపుణుల కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా మార్బల్ శ్రీను

జమ్మలమడుగు : జిల్లా పరిశ్రమల నిపుణులు ప్రమోషన్స్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్న మార్బల్ శ్రీనును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా మంగళవారం మార్బల్ శ్రీను జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలను కలిసి కాపిని అందించారు. సహకరించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఓటర్ల వివరాలు సేకరించాలి

జమ్మలమడుగు : బీఎల్‌ఓలు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు కచ్చితంగా ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి ఇంట్లో 18 సంవత్సరాలు నిండి ఉన్న ప్రతి ఒక్కరు ఓటర్లుగా నమోదు చేసుకునేవిధంగా చేయాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు సూచించారు. మంగళవారం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో ఆర్డీఓ కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో వెళి ఓటర్ల వివరాలతోపాటు మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, నూతన ఓటర్లు ఎవరైనా ఉన్నారో వారిని గుర్తిస్తే తమకు వివరాలను తెలియపరచాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చిన సమాచారం మేరకు తాము కూడ క్షేత్రస్థాయిలో వెళ్లి ఇతర ప్రాంతాలలో ఉన్న వారిని గుర్తించి తొలగిస్తామన్నారు.

భక్తి శ్రద్ధలతో పుష్ప‘గిరి’ ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పూజలు చేస్తున్న భక్తులు



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వల్లూరు : పుష్పగిరి పుణ్య క్షేత్రంలో అధిక శ్రావణ మాస పూర్ణిమను పురస్కరించుకుని మంగళవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలివచ్చిన భక్తులు పుష్పగిరి కొండకు కొబ్బరి కాయలు కొట్టి భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీలక్ష్మీ చెన్నకేశవ, శ్రీ సంతాన మల్లేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. పెన్నా నదిలో స్నానాలు ఆచరించారు. భగవద్గీత ఉపన్యాసకులు రాధా మనోహర్ దాస్ భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు సనాతన హిందూ సాంప్రదాయాలను గురించి, ధర్మం గురించి వివరించారు. కొందరు దాతలు భక్తులకు అల్పాహారం, మంచి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

జాతీయ రహదారి కోసం సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

జమ్మలమడుగు : నంద్యాల–జమ్మలమడుగు వరకు ఏర్పాటు చేసే జాతీయ రహదారికి రైతులు సహకరించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు కోరారు. మంగళవారం జమ్మలమడుగు, పెద్దముడియం మండలాలకు చెందిన భూములు కోల్పోతున్న రైతులు, జాతీయ రహదారి అధికారులతో కలసి ఆర్డీఓ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. పెద్దముడియం మండలంలోని నాగిరెడ్డిపల్లె, గుల్లకుంట గ్రామాలు, జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు, మోరగుడి, జమ్మలమడుగు, కన్నెలూరు ప్రాంతాలకు చెందిన రైతుల భూములలో జాతీయ రహదారి వెళ్తోంది. అత్యధికంగా జమ్మలమడుగు మండలంలోని 37.12 సెంట్లు భూమి అవసరం అవుతుందన్నారు. మొత్తం 174 మంది రైతుల భూముల్లో ఈ రహదారి పోతుందన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎస్.ఉప్పలపాడు గ్రామ రైతులకు రూ.12.51 లక్షలు, మోరగుడి రైతులకు రూ.16 లక్షలు, జమ్మలమడుగు, కన్నెలూరు రైతులకు ఎకరాకు రూ.24 లక్షల పరిహారం ఇవ్వడం కోసం ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాబట్టి రైతులు తమకు సంబంధించిన ఏమైన ఇబ్బందులు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. జాతీయ రహదారి నిర్మాణం జరిగితే భూములకు మంచి ధర వస్తుందన్నారు. ఇప్పటికే జాతీయ రహదారి నిర్మాణం కోసం సంబంధించిన భూసర్వే పూర్తిచేసి గెజిట్ విడుదల చేశామన్నారు. రైతులు వీలైనంత త్వరగా సమ్మతిని తెలియజేస్తే జాతీయ రహదారి పనులు వేగవంతం అవుతాయని సూచించారు. కార్యక్రమంలో జాతీయ ర హదారి నిర్మాణం డీఈ విజయకుమార్‌రెడ్డి, ఏఈ సురేంద్రారెడ్డి, తహసీల్దార్‌లు జ్యోతి, తిరుపతయ్య, డీటీ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలకు ఆధునిక హంగులు



మున్సిపల్ భవనం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తదితరులు

ఎర్రగుంట్ల : పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ కేంద్రం, పశువైద్యశాల భవనాలను ఆధునీకరణ హంగులతో తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి త్వరలో ప్రారంభించనున్న భవనాలను పరిశీలించి మాట్లాడారు. గతంలో ప్రభుత్వ భవనాలను టీడీపీ పాలకులు పట్టించుకోలేదన్నారు. నూతన హంగులతో నిర్మిస్తున్న ఈ భవనాలను త్వరలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. అలాగే ఈ భవనాల మధ్య ఏర్పాటు చేస్తున్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఎర్రగుంట్ల వాసి అయిన సాక్షి పైనాన్స్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి ఏర్పాటు చేశారు. అలాగే ఎర్రగుంట్ల నుంచి కదిరివారిపల్లి–వలసపపల్లి రోడ్డును సెల్ టవర్ వీధి మీదుగా నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన శాఖ ప్రధాన సలహాదారులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, కమిషనర్ పి.జగన్నాథ్, వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా భవాని పీరు ఉత్సవం

పులివెందుల టౌన్ : పట్టణంలో భవాని పీరు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. భవాని పీరును మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు దర్శించుకున్నారు. ఈ ఉత్సవం మారుతి హాలు రోడ్డు, మెయిన్ బజార్ మీదుగా కొనసాగింది. గ్రామోత్సవంలో విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కౌన్సిలర్ కొండల్రావ్, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రమౌళి, సోపాలవీరా, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును జోకర్‌ను చేస్తున్న బీటెక్ రవి

మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : మోసకారి చంద్రబాబును సైతం తన మోసపూరిత మాటలతో పులివెందులలో ఉన్నది లేనట్లు చెప్పి జోకర్‌ను చేస్తున్న జూదరుడు బీటెక్ రవి అని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్పలు అన్నారు. మంగళవారం వైఎస్ మనోహర్‌రెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందులలో అభివృద్ధి జరగలేదని బీటెక్ రవి గుండె మీద చేయి వేసుకుని ఆయన నమ్మే దేవుడి మీద నిజాయితీగా ప్రమాణం చేయగలడా అని ప్రశ్నించారు. పులివెందుల ప్రాంతంలోని ప్రాజెక్టులపైన, ప్రజా సంక్షేమం, ప్రజల మౌలిక సదుపాయాలపైన, రాయలాపురం బ్రిడ్జి–మెడికల్ కళాశాల వరకు జరిగిన అభివృద్ధిపై చిత్తశుద్ధితో ఉన్నది ఒక్క వైఎస్సార్ కుటుంబానికి మాత్రమేనని.. వైఎస్సార్‌సీపీ నాయకులైన మేము ఎక్కడైనా ప్రమాణానికి సిద్ధమన్నారు. రేపు పులివెందుల నియోజకవర్గంలో చంద్రబాబు యాత్ర మొదలయ్యే పైడిపాలెం ప్రాజెక్టు నుంచి పార్నపల్లె చిత్రావతి రిజర్వాయర్ వరకు ఎక్కడ చూసినా ఏ కాలువలో చూసినా నీరు పుష్కలంగా ఉండటం చూస్తే జగన్‌మోహన్‌రెడ్డికి ప్రాజెక్టులపైన ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బీటెక్ రవి లాంటి అబద్ధాల కోరు మాటలు విని పాపం చంద్రబాబు మోసపోయి ఇక్కడేదో ఇరిగేషన్ ప్రాజెక్టులో నీరులేదు అనే భ్రమలో ఇక్కడికి షెడ్యూల్ పెట్టుకున్నారని, పాపం ఇక్కడికి వచ్చిన తర్వాత తెలుస్తుంది అన్ని కాలువల్లో కోనసీమ తరహాలో నీరు సమృద్ధిగా ఉందని.. ఆ తర్వాత బీటెక్ రవికి చంద్రబాబుకు జరిగే సంఘర్షణ మాకు సంబంధంలేదన్నారు. బీటెక్ రవి ఒక జాతీయస్థాయి జూదరుడు, గతంలో రెడ్ హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో పెట్టి అక్కడ స్టేషన్ బెయిల్ ఇస్తే బయటకు వచ్చిన వ్యక్తిని చంద్రబాబు పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిగా నిలబెట్టడం కన్నా సిగ్గుచేటు మరొకటి లేదన్నారు. పులివెందులలో ఒక్క పరిశ్రమలేదు అని చెప్పుకొచ్చే బీటెక్ రవి ఒకసారి ఐజీ కార్ల్ వద్దకు వెళ్లి తాత్కాలిక భవనాల్లో దాదాపు 400 మందితో ప్రొడక్షన్ ప్రారంభించిన ఆదిత్య బిర్లా, నూటెక్ బయోసైన్సెస్ సంస్థలను పరిశీలించి నిజానిజాలు తెలుసుకోవాలని.. అదేవిధంగా త్వరలో చిత్తూరు అపాచీ పరిశ్రమకు అనుబంధంగా పులివెందులలో అపాచీ పరిశ్రమ ప్రారంభమవుతుందని.. క్యాసినో పర్యాటక ప్రాంతాలు పర్యటించే బీటెక్ రవికి పులివెందుల గురించి తెలుసుకునే సమయం ఉందో లేదో తెలియదన్నారు. 2024లో పులివెందుల నియోజకవర్గంలో పార్లమెంటు సభ్యుడు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు ఒక్క పులివెందుల నియోజకవర్గ పరిధిలోనే లక్ష ఓట్ల బంపర్ మెజార్టీతో గెలిపించడానికి పులివెందుల ప్రజలు కంకణం కట్టుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, రంగనాయకులు, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, చంద్రమౌళి, నూరుల్లా, సిద్ధయ్య, డేనియల్‌బాబు, శ్రీరాములు, హనుమంతునాయుడు, తదితరులు పాల్గొన్నారు.